క్లుప్తంగా

నూతన కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడి మార్కెట్ కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమార్, గౌరవ అధ్యక్షుడిగా మల్లాగౌడ్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్‌గౌడ్, శేఖర్, ప్రధానకార్యదర్శిగా రామచంద్రం, సంయుక్త కార్యదర్శిగా ఖాజాపాష, కోశాధికారిగా శివప్ప, ప్రచార కార్యదర్శిగా శంకర్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా స్వామి, మల్లేశ్, సంజీవరెడ్డి, అశోక్, మల్లేశ్‌యాదవ్, కరుణాకర్, రాజు, శ్రీకాంత్, జగన్‌మోహన్, నర్సింహులుగౌడ్, శ్రీనివాస్, ప్రవీణ్‌లు ఎన్నికయ్యారు.

జిల్లా కన్వీనర్‌గా తిరుపతి

సిద్దిపేటరూరల్: కిసాన్ మోర్చా సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా బైతి తిరుపతి నియమితులయ్యారు. ఆదివారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ, తనపై ఉన్న నమ్మకంతో బాధ్యతను అప్పగించిన కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు, బీజేపీ జిల్లా శాఖ, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వర్గీకరణతోనే అభ్యున్నతి


మిరుదొడ్డి(దుబ్బాక): జగ్జీవన్ చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

నెట్‌వర్క్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును హర్షిస్తూ ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. మంద కృష్ణ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాలపై 30 ఏళ్లు అనేక ఉద్యమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ విజయాన్ని అమరులకు అంకితం చేస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోసపోయిన చిరువ్యాపారులు

కోహెడ(హుస్నాబాద్): వస్తువు కొంటాడు అంతలోనే వద్దని తిరిగిస్తున్న ఓ వ్యక్తి మాయలో పడి పలువురు వ్యాపారస్తులు మోసపోయారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి పలు షాపుల్లో వస్తువులు కొని రూ.500ల నోటు ఇస్తాడు. మిగతా చిల్లర తీసుకుంటాడు. మరి ఎందుకో ఏమిటో వెంటనే కొన్న వస్తువు వద్దని తిరిగి డబ్బులు తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే తమను మోసం చేశాడని పలువురు షాపు నిర్వాహకులు ఆరోపించారు. ఓ షాపు యజమాని గమనించి అదుపులోకి తీసుకునే లోగా బైక్‌పై పరిపోయాడని స్థానికులు తెలిపారు. ప్రతీ ఆదివారం కొనసాగుతున్న వారంతపు సంతాలో చిరు వ్యాపారులను కూడా మోసం చేస్తున్నాడని, ఇక్కడ కూడా పోలీసులు నిఘా పెట్టి అతడిని అదుపులోకి తీసుకోవాలని కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


మున్సిపల్ చైర్మన్ మంజులకు మొక్కలు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు వివిధ రకాల మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే తరాలకు మనం ఇచ్చే ఆస్తి చెట్లని పేర్కొన్నారు. అందరూ మొక్కలను పరిరక్షించాలన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలో ఉన్న నాగసముద్రాలలో గల బాలికల వసతి గృహంలో కుక్(వంట మనిషి) పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ దేశిరెడ్డి ఆదివారం తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు తమ పరిధిలోని ఆసక్తి గల మహిళలకు తెలపాలన్నారు. ఈనెల 5 నుంచి 9 లోపు తమ బయోడేటా, ఆధార్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిరుపయోగంగా కొమురవెల్లి బస్టాండ్

- మందుబాబులకు అడ్డా
- పట్టించుకోని అధికారులు


బస్ ప్రాంగణంలో మద్యం సీసాలు

ఈ బస్టాండ్‌లో బస్సులు నిలుపకపోవడంతో నిరుపయోగంగా మారింది. కేవలం జాతర సమయంలోనే ఇక్కడ బస్సులు నిలుపుతున్నారు. కాగా జనసంచారం లేక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారింది కొమురవెల్లి బస్టాండ్


కొమురవెల్లి బస్టాండ్

కొమురవెల్లి(సిద్దిపేట) : మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు గతంలో ఆలయ సమీపంలో బస్టాండ్ నిర్మించారు. ఇటీవల ఆలయ అధికారులు రూ.50 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. ఇంత వరకు బాగానే ఉన్న ఆర్టీసీ అధికారులు బస్సులను బస్టాండ్‌లో నిలిపేందుకు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. కేవలం జాతర సమయంలో (జనవరి నుంచి ఏప్రిల్) శని, ఆదివారాలు మాత్రమే ఇక్కడ బస్సులు నిలుపుతారు. మిగతా రోజుల్లో కాకుండా పోలీస్ బొమ్మ చౌరస్తాలో ఆపుతుండగా ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూస్తూ ఎండకు, వానకు నిల్చొని ఇక్కట్లకు గురవుతున్నారు. జాతర ముగిసిన తర్వాత ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను పట్టించుకోకపోవడంతో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. నిత్యం మందు బాబులు మద్యం తాగి బస్‌స్టాండ్ ప్రాంగణాన్ని ఖాళీ సీసాలతో నింపుతున్నారు. రోజూ జనగామ, సిద్దిపేట, హైదరాబాద్, యాదగిరిగుట్టల నుంచి పదుల సంఖ్యలో బస్సులు కొమురవెల్లి మీదుగా వెళ్తుంటాయి. వాటిని వెంటనే రవాణా శాఖ అధికారులు చొరవ తీసుకుని బస్టాండ్‌లో నిలుపేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



కొమురవెల్లిలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ విషయమై అధికారులు స్పందించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి. బస్సులను రోడ్డుపై నిలపడంతో భక్తులకు ఇబ్బంది కలుగుతుంది.. ఆపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

– సనాది కరుణాకర్, స్థానికుడు

స్నేహ బంధం గొప్పది


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)లో..


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వనితక్లబ్ ఆధ్వర్యంలో..


గజ్వేల్‌రూరల్‌లో.. 1990-94వ బ్యాచ్‌ల పదోతరగతి పూర్వ విద్యార్థులు

స్నేహితుల దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా కులం, మతం, ప్రాంతం అనే బేధం లేకుండా అందరూ సమానంగా పొందేది స్నేహమని పలువురు అన్నారు.

– నెట్‌వర్క్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


నాయకులతో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ పట్టుకోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ హుస్నాబాద్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో మహాసముద్రానికి వనభోజనాలకు వెళ్లారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ, ప్రభుత్వ వ్యతిరేకత ప్రజల్లో ఉందని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలు చేయకపోవడం లాంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బొజ్జ హరీశ్, అన్వర్ పాష పాల్గొన్నారు.

అసెంబ్లీలో బిల్లు పెట్టాల్సిందే


మాట్లాడుతున్న అసైన్డ్ భూ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందు, నేతలు

మిరుదొడ్డి(దుబ్బాక): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అసైన్డ్ భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పిస్తూ బిల్లు ప్రవేశ పెట్టాలని అసైన్డ్ భూ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైండ్ల నందు డిమాండ్ చేశారు. ఆదివారం చెప్యాల క్రాస్ రోడ్డులో ఆయన మాట్లాడుతూ, గత ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. అసైన్డ్ భూముల చట్టం 1977ను రద్దు చేసి కొత్త బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదించాలన్నారు. ఈ భూముల అమ్మకం, కొనుగోళ్లు, మార్టిగేజ్, గిఫ్ట్ డీడీలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల ద్వారా జరిపేందుకు ప్రత్యేక జీఓ తీసుకు రావాలన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ప్రత్యేక దృష్టి సారించి, బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ప్రతిపాదించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సన్న, చిన్న కారు రైతులు మాచపురం యాదగిరి, బోడెల్లి ఎల్లయ్య, నర్సింహులు, సత్తయ్య, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనాలు


సిద్దిపేటరూరల్: 2007-08వ బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు


సిద్దిపేటకమాన్: 2003-04వ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనంలో..


1985-90వ బ్యాచ్‌ల పదోతరగతి పూర్వ విద్యార్థులు

జిల్లాలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. క్లాసుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. అనేక ఏళ్ల తర్వాత అందరూ కలిసి మాట్లాడుకుని.. భావోద్వేగానికి గురయ్యారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించి పూలమాలలు, శాలువతో సన్మానించారు.

– సిద్దిపేటరూరల్/సిద్దిపేటకమాన్/జగదేవ్‌పూర్(గజ్వేల్)

కష్టపడ్డ కార్యకర్తలకు ప్రాధాన్యం

కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ


నరహరికి నియామకపత్రాన్ని అందిస్తున్న హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు పదవులు లభిస్తాయని సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ భరోసా ఇచ్చారు. ఆదివారం సిద్దిపేట పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆయన సమక్షంలో ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కొమ్ము విజయ కుమార్ ఆధ్వర్యంలో రూరల్ మండలం తోర్నాలకు చెందిన కొత్తూరు నరహరిని, సిద్దిపేట పట్టణానికి చెందిన పుట్ల ఏసును ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నుకొని, నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమన్నారు. పార్టీ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, డీసీసీ జనరల్ సెక్రటరీ మార్క సతీశ్, రూరల్ మండల్ కిసాన్ సెల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సాకి ఆనంద్, దాస్ అంజన్న, కనకయ్య, తప్పెట శంకర్, శ్రీశైలం, కనకయ్య గౌడ్ పాల్గొన్నారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలి

సీఐ శ్రీనివాస్


పోతారం(ఎస్)లో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్: ప్రజల రక్షణ కోసమే పోలీసులు పని చేస్తారని, సమస్యలుంటే నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయండని సీఐ కె. శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పోతారం(ఎస్)లో చట్టాలు సైబర్ నేరాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, అక్రమాలు, అన్యాయాలు జరిగినప్పుడు నిర్భయంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం చేస్తారని సూచించారు. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే 100కు ఫోన్ చేసి సమాచారమిస్తే వెంటనే బ్లూకోల్ట్ సిబ్బంది సంఘటన ప్రదేశానికి చేరుకొని గ్రామస్తులకు సహాయ పడుతారన్నారు. అవినీతి అక్రమాలు జరిగితే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామన్నారు. గ్రామ రక్షణ కోసం సీసీ కెమెరాలు అవసరమన్నారు. ప్రతి పల్లెలో వాటిని బిగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

కొండపాక(గజ్వేల్): సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ కోరారు. మండల పరిధిలోని వెలికట్టలో యువకులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఎక్కువ శాతం సెల్‌ఫోన్లకు అలవాటు పడుతూ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటుందన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రభావాలకు లోనై ఇబ్బందులకు గురి కావద్దన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాల వినియోగాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో నేరాల సంఖ్యలు తగ్గించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్ఐ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అమ్ముల రమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్ రావు, నాయకులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండాలి

గజ్వేల్‌రూరల్: చిన్న తగాదాలతో తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ప్రజలంతా ఐక్యంగా ఉంటూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గజ్వేల్ సీఐ సైదా పేర్కొన్నారు. మండల పరిధిలోని రిమ్మనగూడలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు అపరిచితుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నీటిని విడుదల చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): దేవాదుల ప్రాజెక్టు ద్వారా మద్దూరు మండలం లద్నూరు రిజర్వాయర్, నర్మెట్ట మండలం వెల్దండ రిజర్వాయర్‌లకు వెంటనే నీటిని విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని లద్నూరు రిజర్వాయర్‌ను పార్టీ నాయకులతో ఆయన కలిసి సందర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లద్నూరు రిజర్వాయర్ కాలువల ద్వారా మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లోని చెరువులు, కుంటలను నింపాలని అన్నారు.

◆ పనుల పరిశీలన

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల కేంద్రంలో అసంపూర్తిగా నిర్మాణం చేపట్టి వదిలేసిన ఎమ్మార్సీ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బాబు ఆధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌లు ఎమ్మార్సీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. గత ప్రభుత్వ రూ. 40 లక్షలతో ఎమ్మార్సీ భవనాన్ని మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పవన్, బీజేపీ నాయకులు రాజేశం, స్వామి, సుధాకర్, రాము, నర్సింహులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సహాయం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తిలో కోట రాజు, బొమ్మ మల్లమ్మ, బోడపట్ల ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా పీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆపై కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు బండి శ్రీనివాస్‌గౌడ్, కూకట్ల బాలరాజుయాదవ్, బొమ్మగాని శివయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని ఆకారం గ్రామానికి మొలంగురి భాస్కర్ ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబానికి ఆపన్నహస్త మిత్ర బృందం ఆర్థిక సాయం అందించింది. ఆదివారం రూ. 15వేలు, నిత్యావసర వస్తువులను అందజేసింది. కార్యక్రమంలో మిత్ర బృందం అధ్యక్షుడు బాలచంద్రం, శ్రీనివాస్, శ్యామ్, సాయి, అనిల్, గణేశ్, గిరిబాబు, రాజు, కృష్ణ, విష్ణువర్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా వీరహనుమాన్ వార్షికోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రం.. మార్కెట్ చౌరస్తాలో ఉన్న వీర హనుమాన్ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఆలయ నిర్వాహకులు కనుల పండుగగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారి విగ్రహానికి వేద మంత్రాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవలో భాగంగా పట్టణ ప్రధాన వీధుల గుండా కోమటి చెరువు వరకు ఊరేగింపు నిర్వహించారు. ఇక్కడ స్వామి వారి విగ్రహానికి చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాల మల్లేశం, పారిపల్లి చరణ్, ఆలయ పూజారి రాం బహదూర్ , సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గుకు చెందిన కొయ్యడ యాదయ్యకు సీఎం సహాయ నిధి కింద రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు గదరాజు యాదగిరి అందజేశారు. అతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు ఈ విషయాన్ని ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. వారికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కొమ్ముల సాయిలు, పొన్నం అయిలయ్య ఉన్నారు.

కొండపాక(గజ్వేల్): పేదలు కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లి, రామునిపల్లికి చెందిన రెడ్డమైన లచ్చవ్వ, రెడ్డమైన సత్తయ్య, రెడ్డమైన శ్రీకాంత్, సీహెచ్ ఎల్లయ్య, పర్శరాములు పేరిట మంజూరైన రూ. 2,17,500ల చెక్కులను ఆదివారం అందజేశారు. చెక్కులు మంజూరు అయ్యేలా కృషి చేసిన హరీశ్‌రావుకు, సహకరించిన కోల సద్గుణకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం అందించే సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌కు చెందిన పలువురికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల సహకారంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 3,01,550 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, నిజాముద్దీన్, సత్యగౌడ్, స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

◆ అన్నదానం

హుస్నాబాద్: పట్టణంలో వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా అమవాస్య రోజున అన్నదానం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నీరుమల్ల రవీందర్, చొల్లెటి సాంబమూర్తి, కిరణ్ కుమార్, రాంబాబు, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు పుర్మ ఆగంరెడ్డి తల్లి పుర్మ రాధమ్మ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేర్యాలకు వచ్చి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి చర్యలు

సిద్దిపేటజోన్: వార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు హామీ ఇచ్చారు. స్థానిక 14వ వార్డు బీఆర్ఎస్ నాయకులు, వార్డు ప్రజలు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డితో కలిసి వారు సమావేశం నిర్వహించారు. ఇటీవల వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి రాజు, తదితరులు పాల్గొన్నారు.

◆ కేటాయించిన స్థలాన్ని ఇవ్వాలి

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ కాలనీలో భవన నిర్మాణ కార్మికులకు కేటాయించిన స్థలాన్ని తమకే ఇవ్వాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాగటి బాబు అన్నారు. ఆదివారం మండల భవన కార్మికుల సమావేశం నిర్వహించారు. తమ స్థలంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులు చేపట్టడం సరికాదన్నారు.

◆ విరాళం అందజేత

వర్గల్(గజ్వేల్): మండలంలోని తున్కిఖాల్సా మహంకాళి అమ్మవారి దేవాలయ అభివృద్ధి కోసం యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు మహ్మద్ సల్మాన్ హుస్సేన్ రూ. 21 వేలను విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు.

◆ ఎస్ఐగా నీరేశ్ బాధ్యతల స్వీకరణ

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల ఎస్ఐగా పీ నీరేశ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన దామోదర్ మర్కూక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలోకి కామారెడ్డి జిల్లా పిట్లం ఎస్ఐగా పని చేసిన నీరేశ్ ఇక్కడ నియమితులయ్యారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల రక్షణకు కృషి చేస్తానన్నారు.

◆ 'మేం వ్యతిరేకిస్తున్నాం'

సిద్దిపేటకమాన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ నర్సింహులు, దేవయ్య అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ సోమవారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలన్నారు. వర్గీకరణ పార్లమెంట్ విధానంలో జరగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లేశ్, సత్తయ్య, రాజు, విజయ్, మాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

◆ విరాళాల సేకరణ

సిద్దిపేటఅర్బన్: కేరళలోని వాయనాడ్ బాధితుల కోసం సీపీఎం సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో విరాళాల సేకరణ చేపట్టారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బాధితులకు చేయూతగా నిలిచేందుకు నిధి సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. సేకరించిన నిధిని వరద బాధితులకు అందిస్తామన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు శిరీష, అర్బన్ మండల కమిటీ సభ్యులు ఉన్నారు.